విష్ణువే గొప్పని వైష్ణవులనుచుండ
శంభుండు గొప్పని శైవులనగ
గణపతి గొప్పని గాణపతులు పల్క
శారద గొప్పని చదువరులన
అల్లా ఘనుడటంచునల్ల తురకలు చెప్ప
శాక్తేయులందరు శక్తియనగ
నేను గొప్పయటంచు నాదు భక్తులు చెప్ప
అందరొక్కటెయని కొందరనగ
సర్వమత సమ్మతముగను సత్యమైన
బ్రహ్మమొక్కటేయని మీరు పలుకవలయు
ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపరతు?
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

మాటలందు తీపి మనసున చేదుంచ
మంచికాదు మీకు మచ్చగాని
మచ్చలేని బ్రతుకె మహిలోన చెల్లురా
వినుడు భారతీయ వీరసుతుడ

ప్రేమస్వరూపులారా! భారతదేశమంతా దేవీ నవరాత్రులు జరుపుకుంటున్నారు. కాని, నవ రాత్రుల విశిష్టత ఏమిటో గుర్తించుటకు ఎవ్వరూ ప్రయత్నించుట లేదు. ప్రతి ఒక్కరి హృదయమూ పవిత్రమైన ఆత్మస్థాయియే! ఆత్మలేని మానవుడు, ఆత్మలేని జీవులు ఎందునూ కానరారు. భగ వంతుడు ప్రతి జీవియందు ఆత్మస్వరూపుడై ఉన్నాడు. భగవంతునికి ఒక ప్రత్యేకమైన రూప నామములు లేవు. కాని, మానవులు వారివారి భావములను పురస్కరించుకొని భగవంతునికి అనేక రూపనామములను కల్పించి ఆరాధన సల్పుతున్నారు. గణపతియే గొప్పవాడని గాణపతు లంటారు. శివుడే గొప్పయని శైవులంటారు. రూపనామములు వేర్వేరుగా ఉండవచ్చునుగాని, భగవంతుడొక్కడే! అయితే, ఎవరి భావములకు తగినట్లు వారికి ఆయారూపములలో గోచరిస్తాడు. కాబట్టి, ఎవరు ఏ రూపమును ప్రేమింతురో వారికి అదే గొప్ప! అయితే, ఒక రూపముకంటే మరొక రూపము గొప్ప అని చెప్పడం అజ్ఞానం. ముఖ్యంగా దేవీ ఉపాసనను, భగవత్ప్రార్థనను మాటలచేకాక క్రియలచేత నిరూపించాలి. మాటలు చెప్పవచ్చు ఎన్నైనా. ఐతే, క్రియారూపమైన ఆరాధనయే నిజమైన ఆరాధన.

ఈ దేవీనవరాత్రులలో దివ్యత్వమును అనేక పేర్లతో ఆరాధిస్తుంటారు. ఇవి ఎవరు నిర్ణ యించినవి? ఎవరికి వారు నిర్ణయించుకున్నవేగాని, భగవంతునికి ఇది, అది అనే భేదము లేదు. దివ్యత్వం ఇట్టిది, అట్టిది అని ఎవరూ నిర్ణయించ లేరు. అందరి హృదయంలో ఉన్న ప్రేమతత్త్వమే దైవత్వము. భగవంతునికి ఒక ప్రత్యేకమైన రూపము లేదు. ప్రేమయే దైవస్వరూపము. సత్యమే భగవత్స్వరూపము. సత్యము సర్వత్రా నిండినది.

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
సత్యంబునదణగె సర్వసృష్టి
సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న?
శుద్ధసత్వమిదియె చూడరయ్య!

ఇది అమెరికన్ సత్యము, ఇది జపాన్ సత్యము, ఇది రష్యన్ సత్యము, ఇది ఇండియన్ సత్యము అని సత్యమును విభజించుటకు వీలుకాదు. అందరియందున్న సత్యస్వరూపము ఒక్కటే. అట్టి సత్యస్వరూపమును ధ్యానించడమే పండుగలు జరుపుకోవడంలో గల పరమార్థం. ప్రతి ఒక్కరినీ గౌరవించాలి. అందరియందు దివ్యమైన ఆత్మతత్త్వ మున్నది. ప్రతి జీవిని గౌరవించడమే నిజమైన

దైవారాధన. ఇతరులను మీరు గౌరవించకున్న మిమ్మల్ని ఇతరులెలా గౌరవించగలరు? మొట్ట మొదట మీరు ఇతరులను గౌరవించండి. అప్పుడే ఇతరులనుండి మీరు గౌరవమునందుకోవడానికి వీలౌతుంది. అందరిలోనున్న ఏకత్వమే దైవత్వము. వేదము చెప్పింది, "ఏకం సత్ విప్రాః బహుధా వదంతి" ఎన్ని పేర్లు పెట్టినా దైవము ఒక్కడే! ఎన్ని రూపములు దాల్చినా దైవము ఒక్కడే! అట్టి ఏకత్వముతోకూడిన దైవత్వాన్ని మీ హృదయంలో ప్రతిష్ఠించుకోవాలి. ప్రేమకు మించిన సత్యము మరొకటి లేదు. సర్వులయందు ఏకత్వంగా ఉన్నటు వంటిది ప్రేమయే! కాబట్టి, ప్రేమను మీరు ఆరాధన చేయండి. మీ హృదయమునందున్న ప్రేమను పరులకందించండి. వారి ప్రేమను మీరు అందుకోండి. ప్రేమకు ప్రేమయే సాక్షి. ప్రేమకు మించిన ఫలము, ప్రేమకు మించిన సౌఖ్యము, ప్రేమకు మించిన ఆనందము మరొకటి లేదు. కనుక, మీ హృదయంలో ప్రేమను నింపుకోండి. పరమాత్ముడు ఎక్కడ, అని మీరు వెతుకనక్కర్లేదు. ప్రేమ ఉన్నచోటే పరమాత్ముడుంటాడు. కనుక, ప్రేమతత్త్వాన్ని మీరు ఆరాధించండి. ఎవ్వరినీ ద్వేషించకండి. ద్వేషము పరమ శత్రువు. ప్రేమ తత్త్వాన్ని పెంచుకున్నప్పుడు శత్రుత్వము దూరమై పోతుంది. మీ విరోధి ఎదురైనా మీరు ప్రేమతో పలుకరించండి. వాడు కూడా ప్రేమతో జవా బిస్తాడు. మీరు ఇతరులకు ప్రేమనందించకుండిన ఇతరులనుండి మీరు ప్రేమను ఎలా అందుకో గలరు? సాయియొక్క ప్రచారము, ప్రబోధలు ప్రేమతత్త్వము ఒక్కటే! ప్రేమకు మించిన ధనము, ప్రేమకు మించిన ఐశ్వర్యము మరొకటి లేదు. ప్రేమకు విలువ కట్టడానికి వీలుకాదు. భగ వంతుడు మీనుండి ఏమి ఆశిస్తున్నాడంటే, ఒక్క ప్రేమను మాత్రమే ఆశిస్తున్నాడు.

ఈ దేవీ నవరాత్రులలో నవవిధములైన భక్తిమార్గములలో మీ ప్రేమను భగవంతునికి అర్పించాలి. ఏమిటా నవవిధములైన మార్గములు?

**శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం**
**వందనం అర్చనం దాస్యం స్నేహమాత్మనివేదనం**

దైవమునకు ఇవ్వవలసినది ప్రేమ ఒక్కటే! లౌకిక విషయాలు కొమ్మలు, రెమ్మలవంటివి. ఇవి మధ్యలో పుట్టినవి. ప్రేమ మాత్రం స్వతస్సిద్ధముగా ఏర్పడినది. దానిని లౌకికవిషయాలపై మరల్చ కుండా నేరుగా దైవంవైపు ప్రవహింపజేయాలి. మీ హృదయాన్ని దయతో నింపుకోవాలి. అప్పుడే మీరు భక్తులనిపించుకోగలరు. 'సత్యం వద, ధర్మం చర,' ఈ రెండింటినీ మీరు ఆచరిస్తే దైవము మీవెంటనే, జంటనే ఉంటాడు.

ప్రేమస్వరూపులారా! ఈ నవరాత్రులను జరుపుకోవడంలో గల ముఖ్యోద్దేశమేమంటే, మీరు దయాస్వరూపులుగా మారాలి. ప్రేమస్వరూపులుగా రూపొందాలి. దయాప్రేమలు లేని హృదయం మరుభూమివంటిది. తెల్లవారి లేచిన తక్షణమే మీరు ప్రేమతత్త్వమును స్మరించాలి. ప్రేమమార్గాన్ని అనుసరించడానికి దీక్షబూనాలి. మీ దైనందిన కార్యకలాపాలన్నింటిలోను ప్రేమ అంతర్వాహినిగా ప్రవహించాలి. అప్పుడే ప్రేమస్వరూపుడైన పరమాత్ముడు మీకు సాక్షాత్కరిస్తాడు.

**ప్రేమరూపము బ్రహ్మంబు ప్రేమమయము**
**ప్రేమను ప్రేమతొ సంధింప నీమమగును**
**కాన ప్రేమను గట్టిగా కలిగియున్న**
**అద్వితీయము నొందగ అర్హుడగును**

ప్రేమచేత కఠినమైన శిలను కూడా వెన్నగా మార్చవచ్చు. స్వామి నిరంతరము ప్రబోధించేది ప్రేమయే! ప్రేమతో ఒక్కతూరి 'బాబా' అని పిలవండి. ఆ ప్రేమయే మీకు ప్రాణంగా నిలుస్తుంది. మీ పిలుపులో ప్రేమ లేకపోతే ప్రయోజనం లేదు. ప్రేమ అనేది 'హార్ట్ ఫుల్'గా ఉండాలేగాని, 'ఆర్టిఫీషియల్'గా ఉండకూడదు. అందరితో స్నేహంగా మెలగాలి. మీ మోముపై చిరునవ్వులు చిందులు వేయాలి. మీ హృదయంలో ప్రేమను నింపుకున్నప్పుడే ఇది సాధ్యమౌతుంది. ప్రేమయే జీవితము. ప్రేమ లేకుండా మీరు క్షణమైనా జగత్తులో నిలువడానికి వీలుకాదు. ప్రేమయే పరమాత్మస్వరూపమని విశ్వసించి, ప్రేమను పెంచుకోండి. ఈ నవరాత్రులలో దేవీ ఆరాధనయొక్క అంతరార్థమేమిటి? చెడ్డను దూరం చేసి మంచిని పెంచుకోవాలి. మీరు చెడ్డను ఎంత దూరం చేసుకుంటారో ప్రేమ మీకు అంత దగ్గరగా

వస్తుంది. ప్రేమను ప్రత్యేకంగా పిలువ నక్కర్లేదు, తనంతట తానే వస్తుంది.

విద్యార్థులారా! మీ అందరిలోను ప్రేమ ఉన్నది. ఆ ప్రేమను ప్రాకృతమైన ప్రేమగా మార్చుకోకండి. దానిని ఆత్మస్వరూపంపై నిల్పుకోండి. ఆధ్యాత్మిక ప్రేమయే నిజమైన ప్రేమ. పదార్థసంబంధమైనది ప్రాకృతప్రేమ. ఇది మార్పుచెందుతుంది. ఆత్మ సంబంధమైన ప్రేమయే శాశ్వతమైనది. "ప్రేమ రూపము బ్రహ్మంబు ప్రేమమయము." ప్రేమకే బ్రహ్మ అని పేరు. 'సో...హం, సో...హం...' అంటూ మీ ఉచ్ఛ్వాసనిశ్వాసములు అడడానికి కూడా ప్రేమయే కారణం. 'సోహం' అనగా 'అది నేనే.' అదే ప్రేమ. ఇది ఒకరియందుండి ఒకరి యందు లేకుండా పోలేదు. ప్రేమ అందరి యందున్నది. ప్రేమ లేనిదే ప్రాణమే లేదు. కనుక, I and you are one అనే సత్యాన్ని గుర్తించండి. భేదానికి అవకాశమివ్వకండి. నీవు వేరు, నేను వేరు అని భావించడంచేతనే ప్రేమ కూడా వేరైపోతున్నది. హృదయము ఒక్కటే. అది క్షణక్షణమునకూ మారునది కాదు. నీవు మాటలు మార్చినా హృదయం మాత్రం మారదు. అందు కోసమే గోపికలు చెప్పారు:

**"ఏ హృదయము నొసగితివొ ఈశ నాకు**
**మగిడి దానినే యర్పింతు మహితమూర్తి**
**పరగ వేరేది తెత్తు నీ అర్చనకు**
**అంజలి ఘటింతు, అందుకోవయ్య నీవు"**

భగవంతునికి మీ హృదయాన్ని అర్పించాలి ప్రేమఫలంగా. అది దైవముయొక్క సొత్తేగాని, మీ సొత్తు కాదు. మీ ప్రాపర్టీ ఈ జగత్తులో ఏ ఒక్కటీ లేదు. భౌతికమైన ప్రాపర్టీలు స్థిరమైనవి కావు. "అనిత్యం అసుఖం లోకమిమం ప్రాప్య భజ స్వమాం," అన్నాడు గీతాచార్యుడు. దైవప్రేమ ఒక్కటే శాశ్వతమైనది. నీవు మారినా అది మారదు. దిక్సూచి యంత్రమును ఎక్కడ పెట్టినా దాని ముల్లు ఉత్తరదిశనే చూపిస్తుంది. అదేరీతిగా, మీ ప్రేమ ఎటువంటి పరిస్థితులందైనా దైవము వైపే ప్రవహించాలి. మీలో Compassion (దయ) ఉన్నప్పుడే మీది Mankind (మానవజాతి) అని చెప్పడానికి వీలౌతుంది. మీరు మానవులుగా జీవించండి. ప్రేమకే మీ జీవితాన్ని అర్పితం గావించండి. మీరు చేయవలసింది అదియే! "నేను భగవంతుణ్ణి ఏవిధంగా ప్రార్థించాలి?" అని కొందరనుకుంటారు. కాని, ప్రార్థన కూడా చేయనక్కర్లేదు. మీ ప్రేమను దైవానికి అర్పితం గావించాలి. నా ప్రేమ మీది. మీ ప్రేమ నాది. మీరు, నేను ఒక్కటే. రెండవ పదార్థమే లేదు.

దివ్యాత్మస్వరూపులారా! మీరు దేహాన్ని ధరించారే గాని, దేహతత్త్వమును మీరేమాత్రము అర్థం చేసుకోవడం లేదు. దేహము పాంచభౌతికమైనది, ఇంద్రియసంబంధమైనది.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు, గణుతింపగ దేహికి చావు పుట్టుకల్
మోహనిబంధ బంధనలు ముద్రలు లేవు నిజంబు చూడ యా
దేహియె దేవదేవుడు, మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!

గుణములతోకూడిన పాంచభౌతికమైన దేహము మీరు కాదు. 'ఇది నా శిరస్సు, ఇది నా హస్తము, ఇది నా గుండె', అని మీరంటారు కదా! మరి 'నేనెవరు?' అని ప్రశ్నించుకోండి. ఈ ప్రశ్న వేసుకుంటే శిరస్సు, హస్తము, గుండె మొదలైన అంగములన్నీ మీకంటే వేరుగా ఉన్నాయని స్పష్టమౌతుంది. అంగములతో కూడినది దేహము. మీరు దేహస్వరూపులు కారు. దేహములోని ప్రతి అంగములోను భగవంతుడు రసస్వరూపుడై సంచరిస్తున్నాడు. కనుకనే, భగవంతుని 'అంగీ రసాయనమః' అని స్తుతిస్తున్నారు. రసస్వరూపుడైన పరమాత్మునికి ఒక ఆకారానికి పరిమితం చేయడం అజ్ఞానం. అలాంటివారికి భగవంతుడు చిక్కడు. రసస్వరూపమైన నిరాకారతత్త్వమును స్మరించాలి. భౌతికమైన ఆకారము మార్పుచెందునటువంటిదే! ఈరోజు బాలుడు... రేపు యువకుడు... ఎల్లుండి వృద్ధుడు. ఈరీతిగా, దేహము మార్పుచెందుతూనే ఉంటుంది. కాని, నీవు ఏనాటికీ మార్పు చెందవు. నీవు దైవస్వరూపుడవు. ఈ సత్యాన్ని గుర్తిస్తే భౌతికమైన మార్పులు మీపై ఏమాత్రము ప్రభావము చూపలేవు.

స్వామికి కొన్ని దినములనుండి ఆరోగ్యం సరిలేదని మీరు అనుకుంటున్నారు. మై హెల్త్ ఈజ్ వెరీగుడ్, వెరీగుడ్. My health is very good, very good, very good ఆరోగ్యమనేది దేహానికి సంబంధించినది. కాని, నేను దేహమునకు సంబంధించినవాడను కాను. మీరు నన్ను దేహస్వరూపునిగా భావించడంచేత ఆరోగ్యం సరిలేనట్లుగా మీకు కనిపిస్తున్నది. "యద్భావం తద్భవతి". మీరు నన్ను దేహ స్వరూపునిగా భావించకండి. నేను దేహిని. నాకు, మీకు భేదము లేదు. నాలో సర్వశక్తులూ ఉన్నవి. పరులను సంతృప్తిపెట్టే నిమిత్తమై, డాక్టర్లను సంతృప్తిపెట్టే నిమిత్తమై నేను ఈవిధంగా నడుచు కుంటున్నానేగాని, నాలో ఎట్టి అనారోగ్యమూ లేదు. ఎప్పుడూ నేను ఆరోగ్యవంతునిగానే ఉంటున్నాను. కేవలం ఈనాడే కాదు, 96 సంవత్సరములవరకు నేను ఇట్లనే ఉంటాను. నేను ఏమి కావలసినా చేయగలను. కాని, ఈ దేహమును ఆధారం చేసుకున్నవారికి వృద్ధాప్యం కనిపిస్తుంది. కాని, నాకు వృద్ధాప్యము లేదు. నేను ఎప్పుడూ ఒక్కటే. ఏది కావలసినా నేను చేసుకోవచ్చు. అయితే, ఇది మీ దేహము. ఇది మీ నిమిత్తమై ఏర్పడినది. మీరు మార్చుకుంటే ఏరకంగానైనా మారుతుంది. 'మా స్వామి గట్టిగా ఉన్నాడు,' అనుకోండి. నేను తప్పక గట్టిగానే ఉన్నాను. నాకేమాత్రము బలహీనత లేదు. నా అంగములు బలహీనముగా కనిపించవచ్చు. కాని, నాది ఆత్మస్వరూపమేగాని, అంగస్వరూపము కాదు. ఎప్పుడైనా సరే, మీరు దైవాన్ని ఆత్మస్వరూపునిగా తలచండిగాని, ఆకారస్వరూపునిగా తలచకండి. దేహాభిమానమును ప్రక్కకునెట్టండి. ఆత్మస్థాయిని మీరు విశ్వసించండి. ఆధ్యాత్మికతను అభివృద్ధి పరచుకున్నప్పుడే మీకు ఆత్మస్వరూపము అర్థ మౌతుంది. చూడండి మీరు – ఆకారాన్ని స్మరిస్తే నేను రెండడుగులు కూడా వేయలేను. కాబట్టి, ఆకారాన్ని తలచకుండా కేవలం ఆత్మస్వరూపాన్నే విశ్వసించండి. ఆత్మనే ప్రాణంగా తీసుకోండి. నేనెప్పుడూ చక్కగా, ఆరోగ్యంగానే ఉంటాను.

విద్యార్థులారా! మీ అందరికీ ఇటువంటి శక్తి ఉంది. కాని, మీ శక్తిని మీరే చేతులారా పాడు చేసుకుంటున్నారు. మీ చేతిలో ఉంటున్నది మీ యవ్వనమంతా. మీ చేతిలో ఉంటున్నది మీ ప్రాణశక్తి అంతా. ప్రాణశక్తియే మీరుగాని, దేహశక్తి మీరు కాదు. దేహమును కేవలం ఒక సహాయంగా తీసుకొని వచ్చారు. (టేబుల్‌పైనున్న వెండిగ్లాసును చూపిస్తూ) ఇదొక టంబ్లరు. ఇందులో నీరుంది. నీటికి ఆధారం టంబ్లరు. టంబ్లరుకు ఆధారం వెండి. మరి వెండికి ఆధారమేమిటి? అదియే భగవత్స్వరూపము. అదియే విష్ణుస్వరూపము. ఇది పదార్థముతో చేయబడినది కాదు. పదార్థదృష్టికి పదార్థముగానే గోచరిస్తుంది. కాబట్టి, పదార్థదృష్టిని దూరం చేసుకోండి. 'మా స్వామికి ఆకారము ప్రధానం కాదు, ఆనందమే ప్రధానం' అని గుర్తించండి. ఆనందస్వరూపాన్ని చింతించండి. తప్పక మీలో ఆనందము ఆవిర్భవిస్తుంది.

గతవారము దినములనుండి అందరూ మాట్లాడుతున్నారు, అందరూ పలుకరిస్తున్నారు కానీ మాస్వామి ఒక్క మాటైనా మాట్లాడలేదే అని చాలామంది విచారిస్తున్నారు. నాది ఎప్పుడూ కూడను ప్రేమతో కూడినటువంటిది. మీ మధ్యలో వచ్చినప్పుడు ఎంత బలమో, ఎంత ఆనందమో. చెప్పరాని ఆనందము కల్గుతుంది. నాకు ఆహారవిహారములు కూడా అవసరములేదు. మీ ఆనందమే నా ఆహారము. మీరు కూడను ఆరకంగా తలచుకోవాలి. రామలక్ష్మణులను విశ్వామిత్రుడు యాగరక్షణకు తీసుకొనిపోతూ సరయూనది తీరముదగ్గర 'రామలక్ష్మణులారా! కూర్చోండి. మీరు నా వెంట వచ్చినది కేవలము విహార నిమిత్తము కాదు. యజ్ఞసంరక్షణ నిమిత్తము వస్తున్నారు. మీరు ఆహారనిద్రలను పూర్తి త్యజించాలి. ఈ ఆహారము నిద్ర ఉండటంచేత మీరు దేనినీ సాధించలేకపోతున్నారు'. అప్పుడు వారికి ఉపదేశము చేశాడు. ఆ విశ్వామిత్రుడు దశరథుని దగ్గర 'దశరథా! మీరు వీరిని బిడ్డలుగా భావిస్తున్నారు. వీరు చిన్న పిల్లలు కాదు. వీరిద్దరు కేవలము ఆకార స్వరూపులు కాదు. సరయూతీరములో కూర్చొని అక్కడ వారికి రెండు మంత్రాలు చెప్పాడు. నీవు దేహము కాదు, ఆత్మ. నీవు కేవలము చైతన్యశక్తి మాత్రమే కాదు. చైతన్యశక్తికి మించిన శక్తి నీలో ఉంటున్నాది. ఆ శక్తితో మీరు కూడినవారు. ఈ రెండింటిని మీరు గుర్తించుకుంటే తప్పక మీకు ఆహారవిహారముల కొరత ఉండదు. ఆ విధముగా విశ్వామిత్రునితో ప్రయాణము చేసి యాగ సంరక్షణ చేసారు. ఎక్కడికి పోయినప్పటికి ఆనందము రాముని యొక్క స్వరూపము. అట్టి ఆనందమును నీవు పెంచుకో. కానీ ఆకారమును నీవు ఆనందముగా తీసుకోవద్దు. ఈ దేహము నాది కాదుదీ దేహము ఎవరిదో. ఆహార సంబందమైనది.

**మలినపు కొంప రోగముల బ్రుగ్గెడు సేవకగంప జాతసం**

**చలముపొందు దుంప భవసాగరమీదగలేని కంప అ**

**బుల పొదిలెమ్ము చూడ మన మెప్పుదలంపగ దేహమింక ని**

**శ్చలమి నమ్మబోకు మనసా! హరి పాదములాశ్రయింపవే.**

ఈ దేహమును నీ దేహముగా భావిస్తున్నావా? ఇది చాలా పొరపాటు. దేహభావము త్యజించు. ఆత్మాభిమానము పెంచుకో. అప్పుడే నీవు ఆత్మస్వరూపుడుగా మారిపోతావు. లేపోతే కాలి నొప్పి, చేయినొప్పి యిలాంటి నొప్పులంతా ఊయలుదేరతాయి. ఎప్పటికీ యీ నొప్పులు శాశ్వతమైనవికాదు. భ్రమించే వరకుమాత్రమే నొప్పులు. నీవు భ్రమించక త్యజించినప్పుడు ఈ దేహముతో సంబంధమే లేదు. ధ్యానమనగా ఏమిటి? దేహాభిమానమును త్యజించి ఆత్మాభిమానమును పెంచుకోటమే. నిరంతరము దేహాభిమానము పెంచుకుంటూ ఆత్మాభిమానము పెంచుకొనకుండా ఉంటే ప్రయోజనము లేదు. దేహానికి ఎవ్వరూ సంబంధము కాదు. దేహము దేహముదే. కానీ నేను భగవంతుని యొక్క సొత్తు. ఆ రియల్ ఐ నీవు. అందరినీ కలుపుకుంటూపొ కట్టకడపటికీ ఒక్కడే అయిపోతావు. నేను, నీవు అనే భేదమే లేదు. ఎంతచదువులు చదివినా దేహాభిమాము పెంచుకుంటే వ్యర్థమైపోతుంది. చదువు యితరులకు బోధించేనిమిత్తము ఉండాలి. కానీ నీకోసం కాదు. నీవు దేహము కాదు. నీవు రియల్ ఐ. ఆ రియల్ ఐ ని పెంచుకో. ఆకరము మార్పుచెందుతూ పోతుంది.

ప్రేమస్వరూపులారా! దేవీనవరాత్రి తత్త్వము దేహాభిమానము త్యజించుకొని ఆత్మాభిమానమును పెంచుకోటమే అంతరార్థము. ఈ నవరాత్రిలోపల త్యజించుకోండి, ఎంత గొప్పవారౌతారో గుర్తించుకోవచ్చు. చాలా బలహీనంగా వుంటావు, ఆత్మాభిమానాన్ని పెంచుకో బలహీనమంతా పోతుంది. నేనే గాడ్, నేనే గాడ్ అనే భావము పెంచుకోవాలి. దైవాభిమానము పెంచుకోటం చాలా అవసరము.

భజనబినా సుఖశాంతినహి.......

(2003అక్టోబరు5వ తేదీ దసరా సందర్భముగా సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)